సాక్షి ఖమ్మం
బుధవారం । 20 । మార్చి । 2024



వరద కష్టాలకు చెక్

గోదావరి ముంపు నుంచి భద్రాచలం వాసులకు శాశ్వత రక్షణ కల్పించేలా నిర్మించాల్సిన కరకట్ట నిర్మాణ పనులు మొదలయ్యాయి. 8లో




డిస్ట్రిబ్యూటర్ షాపులు సీజ్

ఆర్ఎంపీలకు మందులు సరఫరా చేస్తున్నారని తేలడంతో ఖమ్మంలో పలు మెడికల్ డిస్ట్రిబ్యూటర్ షాపులను అధికారులు సీజ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత తక్కువగానే నమోదవుతుంది. చాలాప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.



న్యూస్‌రీల్

ఎస్సెస్సీ పరీక్షకు 44మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. జిల్లాలోని 97కేంద్రాల్లో 16,580మందికి గాను 16,536మంది హాజరు కాగా 44మంది గైర్హాజరయ్యారని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లా పరిశీలకుడు, అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్‌స్క్వాడ్‌తో పాటు తాను పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామని పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీలో 38 వైద్యుల పోస్టులు భర్తీ

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 38 వైద్యుల పోస్టులు భర్తీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఇందులో 32 మంది మంగళవారం విధుల్లో చేరారని పేర్కొన్నారు. ఈనెల 13న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 15న జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత నియామకాలతో కొంత మేర వైద్యుల కొరత తీరినట్లేనని, ఎన్నికలు ముగిశాక పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కొత్తగా ఎనిమిది రాజధాని బస్సులు



ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం డిపోకు తాజాగా ఎనిమిది రాజధాని బస్సులను కేటాయించారు. ప్రస్తుతం ఉన్న బస్సులు పరిమితి మించి కిలోమీటర్లు తిరగడమే కాక సీట్లు, ఏసీల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఖమ్మం కొత్తగా ఎనిమిది బస్సులను కేటాయించగా హైదరాబాద్‌కు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి ప్రతీ గంటకు బస్సు మొదలవుతుందని, కొత్త, పాత బస్టాండ్లలో రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 99592 25979, 99592 25965 నంబర్లలో సంప్రదించాలని డీఎం సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా పరిశీలకుడు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మదన్‌మోహన్

ఖమ్మం సహకారనగర్/ఏన్కూరు: ఎస్సెస్సీ పరీక్షల సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిశీలకుడిగా నియమితులైన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.మదన్‌మోహన్ మంగళవారం కలెక్టర్ వీ.పీ. గౌతమ్‌ను కలిశారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట డీఈఓ సోమశేఖరశర్మ ఉన్నారు. అనంతరం జేడీ మదన్‌మోహన్, డీఈఓ శర్మ ఏన్కూరు మండలం తిమ్మారావుపేట ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేసిన వారు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఏప్రిల్ 25 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు వచ్చేనెల 25 నుంచి జరగనున్నాయని డీఈఓ డీఈఓ ఈ.సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 3నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు.

'చేయి' అందుకుంటాం!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలోని పలు పార్టీల నేతలు హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు.. బీఆర్ఎస్ తదితర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా హస్తం నాయకులు పావులు కదుపుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు బీఆర్ఎస్ నేతలు 'చేయి' అందుకోవడంపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే, మరో ఇద్దరు ముఖ్య నేతలు బీఆర్ఎస్‌ను వీడి త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

కాంగ్రెస్‌లో చేరికకు నేతల సన్నద్ధం

- మాజీ మంత్రితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే యత్నాలు
- అదే బాటలో కొందరు బీఆర్ఎస్ ముఖ్య నేతలు కూడా..
- ఇప్పటికే సీఎం సభకు హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు
- స్థానిక మంత్రులు, నేతల ఆశీస్సులు ఉంటేనే లైన్ క్లియర్



బీఆర్ఎస్ డీలా పడడంతో..

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ డీలా పడడం, రాష్ట్రంలోనూ అధికారంలోకి రాకపోవడంతో ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ బాట పట్టారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. తాజాగా 45వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్ సైతం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినా ఏ పార్టీలో చేరేది ప్రకటించలేదు. వైరా, సత్తుపల్లి, మధిర, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లోనూ పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు 'చేయి' అందుకున్నారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరితే రాజకీయంగా ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో పార్టీ మార్పునకు సిద్ధమవుతుండగా, వారిని బుజ్జగించేందుకు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

మాజీ మంత్రి.. మళ్లీ

అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌లో చేరిన ఓ మాజీ మంత్రి మళ్లీ కాంగ్రెస్ బాట పట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. గతంలో ఆయనకు ఉన్న పరిచయాలతో ఇప్పటికే పార్టీ పెద్దలతో చర్చించినట్లు సమాచారం. అలాగే ఓ మాజీ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల ఆయన బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేననే ప్రచారం జరుగుతోంది. కొత్తగూడేనికి చెందిన ఓ ముఖ్య నేత సైతం కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, ఇప్పటికే పార్టీ నేతలతో భేటీ అయ్యారని సమాచారం. ఇక గతంలో టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న మానవతారాయ్ సత్తుపల్లి టికెట్ ఆశించినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీ నేతలతో ఉన్న పరిచయాలతో రెండు, మూడు రోజుల్లోనే మూడు రంగుల కండువా కప్పుకోనున్నట్లు అనుచరులకు సమాచారం ఇచ్చారు.

తేట'తెల్లం'..

ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేగా డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా అదేరోజు మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాదీవెన సభకు సైతం తెల్లం హాజరై వేదికపై కూర్చోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇచ్చినట్లయింది. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎంను ఆయన కలిశారు. అప్పటి నుంచి బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండగా, ఆ పార్టీ నేతలు సైతం ఆయనపై ఆశలు వదులుకున్నారు. లోక్‌సభ పోలింగ్ సమీపించే కొద్దీ పార్టీలో చేరికలు పెరుగుతాయని కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది.

మంత్రుల ఆశీస్సులు తప్పనిసరి

కాంగ్రెస్‌లో చేరాలనుకునే బీఆర్ఎస్, ఇతర పార్టీల ముఖ్యులకు స్థానిక మంత్రుల ఆశీస్సులు ఉండాలని ఆ పార్టీ అధిష్టానం మెలిక పెట్టినట్లు తెలిసింది. దీంతో ఇప్పటికే ఢిల్లీ, రాష్ట్ర స్థాయి పెద్దలతో చర్చించిన నేతలు ఇప్పుడు స్థానిక మంత్రుల ఆశీస్సులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో గెలవడమే కాక భారీ మెజార్టీ సాధించాలన్న లక్ష్యం చేరికలతో నెరవేరాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొందరు బీఆర్ఎస్ నేతల చేరికలను కాంగ్రెస్ స్థానిక నేతలు వ్యతిరేకిస్తుండడంతో అధిష్టానం ఎలా ముందుకు వెళ్తుందో వేచిచూడాల్సిందే.

మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్, అధికారులు



విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

ఎన్నికల అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏ దశలో కూడా లోపాలు ఎదురుకాకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఏఆర్ఓలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల విధులను కీలకంగా భావించి ఎక్కడా తప్పిదానికి తావివ్వొద్దని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, ప్రతీ పోలింగ్ కేంద్రం లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, ప్రతీ కేంద్రాన్ని సందర్శించి మౌలిక వసతులు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం సువిధ యాప్ ద్వారా అనుమతులు, 85ఏళ్ల పైబడిన వారితో పాటు దివ్యాంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం–12డీ అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా నిఘా ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈసమావేశంలో ఖమ్మం, భద్రాద్రి అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, వేణుగోపాల్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రెయినీ ఐపీఎస్ పి.మౌనిక, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, శ్రీనివాస్, మధు, డీసీఓ మురళీధర్‌రావు, అధికారులు సాయి కుమార్, కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు ఎదురుకావొద్దు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన ఎంపీడీఓలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. జలాశయాల్లో నీటిమట్టం పడిపోతున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు. బోర్ల మరమ్మతు, ఫ్లషింగ్ చేయించడమే కాక ప్రైవేట్ బావులు, బోర్లను లీజ్‌కు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ప్రైవేట్ స్థలాల్లో బోర్లు వేసే ఆపరేటర్లపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మిషన్ భగీరథ ఎస్‌ఈ సదాశివకుమార్, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఓ హరికిషన్, సీపీఓ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడి లో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా సార్వభౌమ సేవ..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని సార్వభౌమ వాహనంలో వేంచేపు చేసి అత్యంత వైభవోపేతంగా తిరువీధి సేవ నిర్వహించారు.

ఆశలే పెట్టుబడిగా..

- విచ్చలవిడిగా సంతాన సాఫల్య కేంద్రాల ఏర్పాటు
- సంతానం కోసం తపించే దంపతులే టార్గెట్
- జిల్లాలో ఐదు కేంద్రాలకే అనుమతి.. అనధికారికంగా 30 వరకు నిర్వహణ
- కొరఢా ఝుళిపిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ



ఖమ్మంలోని ఓ ఫెర్టిలిటీ సెంటర్‌ను సీజ్ చేసిన హైదరాబాద్ బృందం (ఫైల్)

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో సంతాన సాఫల్య కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. వివాహం జరిగి ఏళ్లు గడిచినా సంతానం లేక ఆవేదన చెందుతున్న దంపతులే టార్గెట్‌గా అనుమతితో సంబంధం లేకుండా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇవి ఎక్కువగా ఉండగా.. అనుమతి మాటేమో కానీ నిపుణులైన వైద్యులు కూడా లేకుండానే నడిపించేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తూ కేంద్రాలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫెర్టిలిటీ సెంటర్, టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వంటి పేర్లతో దందాకు తెరలేపుతున్నాయి. తమ వద్ద చికిత్స చేయించుకుంటే సంతానం కలగడం గ్యారంటీ అని నమ్మిస్తూ దంపతుల నుంచి రూ.లక్షల్లో లాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు అతిక్రమించి సుమారు 30వరకు సెంటర్లు నడిపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు అందిన ఫిర్యాదులతో ఇటీవల జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లలో హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రెండు ఫెర్టిలిటీ సెంటర్లను సోమవారం సీజ్ చేయగా, మరో ఐదింటి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

ఐవీఎఫ్, ఐయూఐ పేరుతో దోపిడీ

సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్, ఐయూఐ సేవల పేరుతో నిర్వాహకులు బురిడీ కొట్టిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి జిల్లా కేంద్రంలో చాలా సెంటర్లు ఏర్పాటుకాగా.. అర్హత లేని వైద్యులతో నడిపిస్తున్న సెంటర్లకు వెళ్లిన దంపతులకు సంతానం కలగకపోగా రూ.లక్షల్లో డబ్బు నష్టపోతున్నారు. మరికొందరు ఇతర అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. చికిత్స పేరుతో సెంటర్ల వైద్యులు వినియోగించే స్టెరాయిడ్ల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. సంతాన లేమికి చికిత్సలో ఐయూఐ(ఇంట్రా యుటిరిన్ సెమినేషన్), ఐవీఎఫ్(ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) విధానాలు కీలకమైనవి. ఈ రెండు విధానాల్లో చికిత్స చేసేందుకు సెంటర్లు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, సరోగసి, ఏఆర్‌టీ విధానాల ద్వారా కూడా సేవలు పొందొచ్చు. ఇందుకోసం ఆస్పత్రులకు జిల్లా లెవెల్ కమిటీ అనుమతి ఇవ్వాలి. కానీ చాలామంది నిర్వాహకులు అనుమతి తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించి సెంటర్లు నడిపిస్తుండడంతో పలువురు ఆర్థికంగా చితికిపోతున్నారు.

అనుమతి లేదు.. నిబంధనలు పాటించరు..

సాధారణంగా ఫెర్టిలిటీ సెంటర్లకు హైదరాబాద్‌లోని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ అనుమతులు ఇస్తారు. సెంటర్ల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జిల్లాకు వచ్చి డీఎంహెచ్ఓతో కలిసి పరిశీలించాక అన్ని అర్హతలు ఉంటే అనుమతులు జారీ చేస్తారు. కానీ జిల్లాలో 30కి పైగా సెంటర్లు కొనసాగుతుండగా.. కేవలం ప్రవీణ ఫెర్టిలిటీ సెంటర్, మాతృశ్రీ ఫెర్టిలిటీ సెంటర్, రోహిత్ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్, శ్యామల హాస్పిటల్, వింగ్స్ జోయా ఐవీఎఫ్ సెంటర్లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. మిగతా సెంటర్ల నిర్వాహకులు అనుమతి లేకుండానే నడుపుతున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు పీసీపీఎన్‌డీటీ, మెడికల్ రిజిస్ట్రేషనే కాక ఇతర అనుమతులన్నీ ఉండాలి. అలాగే, ఏఆర్‌టీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకుని, చికిత్స చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచడం, నిబంధనలకు లోబడి చికిత్స చేయడం తప్పనిసరి అని నిబంధనల్లో పొందుపర్చారు. కానీ చాలా సెంటర్లు ఈ నిబంధనలన్నీ గాలికి వదిలేసి దంపతుల ఆశలతో ఆడుకుంటున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నిబంధనలు అతిక్రమించే ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు తీసుకుంటాము. హైదరాబాద్ నుండి వచ్చిన బృందాలు తనిఖీ నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే రెండు ఆస్పత్రులను సీజ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఐదు సెంటర్లకే అనుమతి ఉంది. సంతానం లేని దంపతులు అనుమతి లేని సెంటర్లకు వెళ్లి నష్టపోవద్దు. ఇక నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారు వెంటనే అనుమతి తీసుకోవాలి. – డాక్టర్ సైదులు, మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్

ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తాం




మహిళా అధికారిని సన్మానిస్తున్న ఏలూరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ఇతర హక్కుల సాధనకు తమ సంఘం కట్టుబడి ఉందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే అన్ని సంఘాలను కలుపుకుని ముందుకు సాగుతామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉండేదని, వేతనాల కోసం 15వ తేదీ దాటినా ఎదురుచూడాల్సి వచ్చేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ హయాంలో పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నా.. సమస్యల పరిష్కారం విషయంలో మాత్రం రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు.

ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం

- ఉపరితల ద్రోణితో వాతావరణంలో మార్పు
- తగ్గిన ఉష్ణోగ్రత, ఉక్కపోత
- వర్షసూచనతో రైతుల్లో కలవరం



ఖమ్మంవ్యవసాయం: వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావం రాష్ట్రంపై కూడా ఉండడంతో ఉష్ణోగ్రతల్లో తేడా వచ్చింది. గత వారంతో పోలిస్తే ఈ వారం జిల్లాలో ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గాయి. ఈ ఏడాది రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, ఈనెల 16వరకు పలుచోట్ల దాదాపు 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం ఉష్ణోగ్రత తగ్గడంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించినట్లయింది. అయితే, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో పంటలు చేతికొచ్చే సమయాన అకాల వర్షం కురుస్తుందేమోనని రైతులు కలవరపడుతున్నారు.

మేఘాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. గత వారం వరకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ప్రస్తుతం 36 నుంచి 32 డిగ్రీల వరకే నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 25 నుంచి 29 డిగ్రీల వరకు పడిపోయాయి. సోమ, మంగళవారం ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. కాగా, మంగళవారం జిల్లాలో వైరాలో గరిష్టంగా 36.1 డిగ్రీలు, ఏన్కూరులో కనిష్టంగా 32.2లడిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అన్నదాతల్లో ఆందోళన

రాష్ట్రంపై రెండు రోజులుగా ద్రోణి ప్రభావం చూపుతుండడంతో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవగా చేతికందే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో కూడా వరి, మొక్కజొన్న చేతికందే దశలో ఉండగా మామిడి కాయ దశకు చేరింది. దీంతో ఆకాశం మేఘావృతమై ఉంటూ చిరుజల్లులు కురుస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ద్రోణి ప్రభావం మరో రెండు, మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ చెబుతుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్ డిగ్రీల్లో)

ప్రాంతం	కనిష్టం	గరిష్టం
వైరా	29.5	36.1
గుబ్బగుర్తి	29.2	35.5
నేలకొండపల్లి	29.7	35.2
తల్లాడ	28.7	34.7
మధిర	27.7	34.6
తిరుమలాయపాలెం	26.3	34.4
ఎర్రుపాలెం	27.7	34.3

క్లుప్తంగా

రూ.42వేల విలువైన మద్యం సీజ్



రామన్నపేటలో సీజ్ చేసిన మద్యంతో డీడీ, పోలీసులు

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్/తిరుమలాయపాలెం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన జిల్లాలోని పలుచోట్ల మంగళవారం చేపట్టిన తనిఖీల్లో అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని సీజ్ చేసినట్లు కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రామన్నపేటలో వద్ద రూ.19,628, దానవాయిగూడెం వద్ద రూ.18,469, గోపాలపురం వద్ద రూ.4,681 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, రామన్నపేటలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు తనిఖీలు చేపట్టారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్‌తండాలో ఎస్ఐ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో బెల్ట్ షాపుల నుంచి రూ.3వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

తల్లాడ: తల్లాడ మీదుగా అక్రమంగా తరలిస్తున్న మూడు లారీల ఇసుకను ఈనెల 1వ తేదీన పోలీసులు సీజ్ చేయగా, మంగళవారం వేలం వేశారు. ఈ ఇసుకను పోలీస్‌స్టేషన్ సమీపాన డంప్ చేయగా మధిర మెజిస్ట్రేట్ ఆదేశాలతో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యాన వేలం నిర్వహించారు. వేలంలో నలుగురు పాల్గొనగా గొల్లగూడెంకు చెందిన దుండేటి వీరారెడ్డి రూ.44 వేలకు ఇసుక దక్కించుకున్నాడు. ఉద్యోగులు భాస్కర్, నల్లగొండ శ్రీను, జానీ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన అమరోజు వీరారెడ్డి(50) ప్రమాదవశాత్తు చెరువులో పడగా మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వీరారెడ్డి కనిపించకపోవటంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈక్రమంలోనే గంగమ్మ గుడి సమీపాన ఉన్న చెరువులో ఆయన మృతదేహం మంగళవారం బయటపడింది. ఆయన ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడు శివారు పిట్టలవారిగూడెంకు చెందిన గట్ల రామయ్య(49) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందగా, అప్పటి నుండి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగగా, కాసేపటికి గమనించిన కుటుంబీకులుఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామయ్య మంగళవారం మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

తమ్మిలేరువాగులో పడిన డీసీఎం

సత్తుపల్లిటౌన్: డీసీఎం వ్యాన్ అదుపుతప్పి వాగులో పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ సత్తుపల్లి శివారులోని తమ్మిలేరు వంతెనపై రెయిలింగ్‌ను ఢీకొని వాగులో పడిపోయింది. దీంతో ప్రమాదాన్ని గుర్తించిన వ్యాన్ డ్రైవర్, వరంగల్ జిల్లాకు చెందిన దేవరాజు సందీప్ చాకచక్యంగా డోర్ తీసుకుని ఈదుతూ ఒడ్డుకు వచ్చాడు. స్వల్పగాయాలైన ఆయన ఆస్పత్రికి వెళ్లగా, డీసీఎంను క్రేన్ సాయంతో బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు మంగళవారం రాత్రి వరకు ఫలించలేదు.

భర్తపై హత్యాయత్నం చేసిన మహిళ అరెస్ట్

ఖమ్మంక్రైం: చెవిదుద్దులు కొనివ్వలేదని ఈనెల 17న ఖమ్మం నిజాంపేటలో భర్తపై టర్పంటాయిల్ పోసి నిప్పంటించిన మహిళను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. చెవిదిద్దుల కోసమని కొంతకాలంగా భర్త యాకూబ్‌పాషాతో గొడవ పడుతున్న సమీనా క్షణికావేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడింది. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉండగా, సమీనాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు



(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,113	6,600
కందులు	9,400	8,050
మినుములు	8,100	7,700
మిర్చి	20,200	12,000
తాలు మిర్చి	11,000	7,000
అలసంద	7,375	7,375

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,045

వరద కష్టాలకు చెక్..



కరకట్ట నిర్మాణానికి తవ్వుతున్న కాలువ

అన్నీ సజావుగా సాగితే రెండు నెలల్లో గోదావరి కరకట్ట నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. పాతికేళ్ల తర్వాత భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు గోదావరి వరదల నుంచి రక్షణ లభించనుంది. ఈ మేరకు నదీ తీరం వెంట పనులు ప్రారంభమయ్యాయి.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ప్రారంభమైన కరకట్ట పనులు

- రంగంలోకి దిగిన భారీ యంత్రాలు
- జోరుగా సాగుతున్న భూ సామర్థ్య పరీక్షలు
- 700 మీటర్ల పొడవుతో కరకట్ట నిర్మాణం
- కూనవరం – భద్రాచలం రోడ్డులో మరో వంతెన

మొదట 7.5 కిలోమీటర్లు..

గోదావరి నదికి 1986లో రికార్డు స్థాయిలో 76 అడుగుల ఎత్తులో వరద వచ్చింది. పట్టణం సగం వరదలో మునిగిపోయింది. శ్రీరాముడు కొలువుదీరిన భద్రగిరి చుట్టూ నీరు చేరుకుంది. అప్పటి నుంచి గోదావరి వరద నుంచి రక్షణ కల్పించాలని ఇటు రామయ్య భక్తులు, అటు భద్రాచలం పట్టణ వాసులు ప్రభుత్వాలను వేడుకున్నారు. ఎట్టకేలకు 2000 సంవత్సరంలో భద్రాచలానికి రక్షణగా సుమారు 7.5 కిలోమీటర్ల పొడవుతో కరకట్ట నిర్మించారు. 1986లో వచ్చిన గరిష్ట వరదను దృష్టిలో ఉంచుకుని కనిష్టంగా పది మీటర్లు, గరిష్టంగా 15 మీటర్ల (సగటున 80 అడుగులు) ఎత్తుతో కరకట్ట ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి వరద నుంచి ఉపశమనం లభించినా.. పూర్తిస్థాయిలో ముప్పు తొలగిపోలేదు.

రోడ్డు కారణంగా కొంతమేర రద్దు..

వరద కాంటూరు లెవల్స్ ఆధారంగా ముందుగా నిర్దేశించిన ప్లాన్ ప్రకారం కరకట్ట చర్ల రోడ్డులో ఏపీలోని యటపాక వద్ద మొదలై కూనవరం రోడ్డులోని సరస్వతి శిశుమందిర్ దాటిన తర్వాత ముగియాలి. యటపాక నుంచి కూనవరం రోడ్డు వచ్చే వరకు కరకట్ట అంతా గోదావరి తీరం వెంబడే ఉంటుంది. కానీ సరస్వతీ శిశుమందిర్ దాటిన తర్వాత గోదావరి తీరం నుంచి కాస్త దూరంగా జరుగుతూ వచ్చి భద్రాచలం – కూనవరం రోడ్డు మీదుగా వెళ్తుంది. దీంతో ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం అవసరం కావడంతో రోడ్డు దగ్గర ఇరువైపులా కరకట్ట నిర్మాణ పనులు రద్దు చేశారు. రోడ్డు నుంచి గోదావరి ప్రవహించే వైపు 600 మీటర్లు, మరో వైపు 100 మీటర్లు వదిలేసి నాడు కరకట్ట నిర్మించారు.

రూ. 38 కోట్లతో పనులు..

గోదావరి వరదలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో మిగిలిన కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు రూ. 38 కోట్లు మంజూరయ్యాయి. అయితే పనులు ప్రారంభించకముందే ప్రభుత్వం మారిపోయింది. దీంతో కరకట్ట నిర్మాణం డోలాయమానంలో పడింది. కాగా, కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కరకట్ట నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో కూనవరం రోడ్డులో కరకట్ట నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనంతరం 700 మీటర్ల పొడవు, 12 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించనున్నారు. జూన్ చివరి నాటికి కరకట్ట పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ వెల్లడించారు.

వంతెనకు అనుమతి వచ్చేనా..?

గతంలో కరకట్ట నిర్మాణానికి కూనవరం – భద్రాచలం రోడ్డు ప్రధాన అడ్డంకిగా మారింది. ప్రస్తుతం కరకట్ట నిర్మించి వరద నుంచి రక్షణ రావాలంటే ఈ రోడ్డు మీదుగా కరకట్ట నిర్మించాలి. ఆ తర్వాత వాహనాల రాకపోకలకు అనుగుణంగా కరకట్ట మీదుగా వంతెన నిర్మించాలి. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ నుంచి అనుమతి రావాలి. గోదావరిపై రెండో వంతెన నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పేలా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కరకట్ట మీదుగా నిర్మించే వంతెన విషయంలో అనుమతులు, టెండర్లు తదితర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

65 అడుగులు దాటితే..

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులు స్థాయి వరకు వరద వస్తే కూనవరం రోడ్డులో ఉన్న లోతట్టు ప్రాంతాలకు పెద్దగా ప్రమాదం ఉండదు. కానీ 65 అడుగులకు మించి వరద వస్తే.. కరకట్ట నిర్మించని భద్రాచలం – కూనవరం రోడ్డు మీదుగా పట్టణంలోకి వరద వస్తోంది. సరస్వతీ శిశుమందిర్, ఆర్టీఓ కార్యాలయం, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్, సుభాష్‌నగర్ తదితర కాలనీలు వరద నీటిలో మునిగిపోతున్నాయి. ముఖ్యంగా 2022 జూలైలో వచ్చిన వరదలతో ఎన్నడూ లేని విధంగా డిగ్రీ కాలేజీ వెనుక ఉన్న కాలనీలోని ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో గతంలో అర్ధంతరంగా ఆగిపోయిన కరకట్ట నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది.

జాతీయస్థాయి టోర్నీ రిఫరీగా మోహన్



మోహన్

ఎర్రుపాలెం: మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈనెల 23నుంచి జరగనున్న 45వ జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నీ రిఫరీగా ఎర్రుపాలెం మండలం మామునూరుకు చెందిన వరికుటి మోహన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రాష్ట్ర రిఫరీ బోర్డ్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. గత ఇరవై ఏళ్లుగా పలు జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా, జాతీయస్థాయి పోలీస్ క్రీడా పోటీల న్యాయ నిర్ణేతగా మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి టోర్నీ రిఫరీగా ఎంపికైన మోహన్‌ను సీనియర్ క్రీడాకారులు జంగా లక్ష్మణరావు, కనకయ్య, జైపాల్, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు తదితరులు అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కూసుమంచి: సూర్యాపేట జిల్లా మోతె మండలం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కూసుమంచి మండలంలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్షేత్ర సందర్శనలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



నర్సరీలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనకు వెళ్లారు. సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం వెళ్లిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అక్కడి నుంచి నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకంలో జాగ్రత్తలను తెలుసుకున్నారు. వక్క మొక్కలతో పాటు అరటి, జాజిపత్రి, కశ్మీర్ యాపిల్, యాలకులు ఇతర మొక్కలను పెంచి విక్రయిస్తున్నట్లు బాధ్యులు తెలిపారు. అనంతరం గంగారంలోని పీఏసీఎస్‌ను కూడా సందర్శించిన విద్యార్థులు సంఘం పనితీరు, రుణాల వడ్డీ రేట్లు తెలుసుకున్నారు. కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

మొబైల్ షోరూమ్‌లో చోరీ

- ఏసీపీ కార్యాలయానికి సమీపాన ఘటన



షోరూంలో పరిశీలిస్తున్న ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్

వైరా: వైరా ఏసీపీ కార్యాలయం సమీపాన ఉన్న దక్షు మొబైల్ షోరూంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైరా బ్రాహ్మణపల్లికి చెందిన రామకృష్ణ షోరూం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆయన షాపు తెరవగా, వెనకాల తలుపు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ చేరుకుని పరిశీలించారు. షాపులో సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి, రూ20 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలయ హుండీలో నగదు...

మధిర: మధిరలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చొరబడిన దుండగులు హుండీలో నగదును చోరీ చేశారు. హుండీ పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.50 వేల నగదు అపహరించినట్లు అర్చకులు హరి రవిశాస్త్రి తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు ఈ విషయాన్ని గుర్తించి ఇచ్చిన సమాచారంతో మధిర టౌన్ ఎస్ఐ సంధ్య, ఫోరెన్సిక్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు.

జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఈలు

పాల్వంచ: జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ వాలీబాల్, లాన్ టెన్నిస్ పోటీలు పాల్వంచలోని విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలతోపాటు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన లాన్ టెన్నిస్ సింథటిక్ కోర్టును కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు, 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ కె.శ్రీనివాసబాబు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఉద్యోగులు, కార్మికుల్లో ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. కాగా, కేటీపీపీ భూపాలపల్లి, పోచంపాడు, రామగుండం, విద్యుత్ సౌధ, జూరాల, పులిచింతల, బీటీపీఎస్, శ్రీశైలం, నాగర్జున సాగర్, కేటీపీఎస్ 5, 6వ దశలతో పాటు 7వ దశ జట్లు పాల్గొంటున్నాయి. జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, ఎస్ఈ యుగపతి, డీఈ ఎస్ఎస్ఎస్ శేఖర్, గేమ్స్ సెక్రటరీలు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, రిఫరీలు ఎం.వీరునాయక్, జి.వెంకటేశ్వర్లు, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వారికి దేహశుద్ధి

కొణిజర్ల: ఆలయంలో సామగ్రి చోరీ చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన మండలంలోని అమ్మపాలెం, రాజ్యాతండా గ్రామాల మధ్య మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. చిత్తుకాగితాలు ఏరుకునే కొందరు మహిళలు, పిల్లలతో కలిసి అమ్మపాలెం శివార్లలో నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మేరమ్మ ఆలయం వద్దకు వచ్చారు. ఆలయంలోని పూజా సామాగ్రి, ఇతర ఇనుప వస్తువులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా, గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా వచ్చేందుకు ఆలస్యం కావడం, పట్టుబడిన వారిలో చిన్న పిల్లలే ఎక్కువగా ఉండడంతో వదిలేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

శవపంచనామాకు లంచం?

- ఏసీబీకి ఫిర్యాదు చేసిన స్థానికులు
- తనిఖీల సమాచారంతో జారుకున్న వైద్యుడు

అశ్వారావుపేట: జ్వరం బారిన పడిన ఓ గిరిజనుడు చనిపోగా.. పోస్టుమార్టం చేసేందుకు గాను ఆస్పత్రి అభివృద్ధి పేరిట వైద్యాధికారి రూ.40వేలు డిమాండ్ చేశాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. అశ్వారావుపేట మండలం రామన్నగూడేనికి చెందిన నారం రామారావు(37) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా సోమవారం అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కొత్తగూడెం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. దీంతో 108 సిబ్బంది మృతదేహాన్ని అశ్వారావుపేట ఆస్పత్రి మార్చురీకి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం మృతుడి బంధువులు జ్వరంతోనే చనిపోయినందున మృతదేహాన్ని తీసుకెళ్తామని చెప్పగా వైద్యుడిని, పోలీసులను సంప్రదించాలని సిబ్బంది సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాక పోస్టుమార్టం చేయాలా, వద్దా తేల్చుకోవాలని చెప్పిన కానిస్టేబల్ ఆ తర్వాత డాక్టర్‌ను సంప్రదించాలని చెప్పాడని సమాచారం. మళ్లీ ఆస్పత్రికి వెళ్లగా అనుమానం ఉన్నందున పోస్టుమార్టం చేయాలని, ఇందుకు ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ.40 వేలు ఇవ్వాలని ఓ వైద్యుడు కోరినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. అంత ఇచ్చుకోలేమని బతిమాలినా ససేమిరా అనడంతో ఓ వ్యక్తి ఏసీబీ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బేరసారాలు సాగగా, కాంగ్రెస్ నాయకులతో చెప్పించినా వినలేదని సమాచారం. చివరకు ఏసీబీ అధికారులు వస్తున్నారనే సమాచారం బయటకు పొక్కడంతో పోస్టుమార్టం చేయకుండానే మృతదేహాన్ని తీసుకువెళ్లాలని వైద్యాధికారి చెప్పినట్లు తెలిసింది. కాగా, వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడిన సమయాన డబ్బుల విషయం ప్రస్తావన రికార్డ్ కావడంతో దాని ఆధారంగా కేసు నమోదుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని వైద్యాధికారి రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లగా పోస్టుమార్టం చేసేందుకు అవసరమయ్యే కట్టుగుడ్డలు, ఇతర ఖర్చుల కోసం సిబ్బందికి నగదు ఇవ్వమని చెప్పామే తప్ప లంచం అడగలేదని పేర్కొనడం గమనార్హం.

బాల్యవివాహం ఘటనలో ముగ్గురిపై కేసు

నేలకొండపల్లి: మైనర్ బాలికను ఓ యువకుడు వివాహం చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూడగా, విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేశారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన యువకుడు కృపానందు ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన బాలికను నేలకొండపల్లి చర్చిలో గతనెలలో వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై అందిన సమాచారంతో తిరుమలాయపాలెం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి సోమవారం విచారించగా నిజమేనని తేలింది. ఈమేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదుతో బాలికను వివాహం చేసుకున్న యువకుడితో పాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన వ్యక్తి, పెళ్లి చేసిన చర్చి ఫాదర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు. అలాగే, బాలికను ఖమ్మంలోని బాలల సదన్‌కు తరలించారు.

రూ.34.50లక్షల విలువైన గంజాయి స్వాధీనం

అశ్వాపురం: ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సోమవారం రాత్రి అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గొల్లగూడెంలోని సీతారామ ప్రాజెక్టు కెనాల్ వంతెన వద్ద ఎస్ఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎంహెచ్ 10 సీఎక్స్ 8193 నంబరు కారు రాగా అందులో తనిఖీ చేయగా 138 కిలోల గంజాయి దొరికింది. దీనిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన రాహుల్ రాజారాం జాదవ్, విశాల్, సునీల్ హెగ్డేలను అరెస్టు చేశారు. గంజాయి, కారు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. చింతూరుకు చెందిన సత్రు గంజాయి సరఫరా చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన దాదూ షేక్ బర్మి పెట్టుబడి పెట్టినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె..



డిప్యూటీ డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలే కాక పీఆర్సీ బకాయిలను చెల్లించకపోతే ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసును మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్ఓకు అందజేశాక ఆయన మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల వేతనాలే తక్కువగా ఉండగా, అవి కూడా సకాలంలో అందకపోవడంతో కుటుంబాలను పోషించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్ఎం విభాగానికి చెల్లించాల్సిన రూ.380 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయడమే కాక పెండింగ్ వేతనాలు, పీఆర్సీ బకాయిలపై నిర్ణయం వెలువరించకపోతే సమ్మె నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణతో పాటు యూనియన్ నాయకులు వి.నీలోహన, ఎ.భవాని, సీహెచ్ చంద్రమణి, పి.రాజేశ్వరి, టి.నాగరాజు, కృష్ణమోహన్, జి.నాగరాజు, సంతోషి, రాజేశ్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ఉచిత ప్రయాణం!



ఎస్సెస్సీ విద్యార్థులతో లతీఫ్

వైరారూరల్: వైరా మండలంలోని కేజీ సిరిపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ లతీఫ్ పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులను ఉచితంగా కేంద్రాలకు చేరవేస్తున్నాడు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో హాజరుకావాలనే ఉద్దేశంతో గరికపాడు, లింగన్నపాలెం, నారపునేనిపల్లి తదితర గ్రామాల విద్యార్థులను ఆటోలో ఉచితంగా వైరాకు తీసుకెళ్లి, పరీక్ష ముగిశాక తిరిగి గ్రామాలకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే గర్భిణులను ఉచితంగా తీసుకెళ్తున్న లతీఫ్ ఇప్పుడు విద్యార్థులకు అందిస్తున్న సేవలతో పలువురి మన్ననలు అందుకుంటున్నాడు.

మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ షాపుల సీజ్



సీజ్ చేసిన ఓ డిస్ట్రిబ్యూటర్ దుకాణం

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని నాలుగు మెడికల్ డిస్ట్రిబ్యూటర్ల షాపులను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఆర్ఎంపీలకు డిస్ట్రిబ్యూటర్లు మందులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో గతనెల 27న ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎంపీలకు మందులు సరఫరా చేసినట్లు తేలడంతో మంగళవారం శ్రీబాలాజీ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్, గోపి మెడికల్ సర్జికల్ ఏజెన్సీస్, శ్రీ ఏటీఎం మెడికల్ ఏజెన్సీస్, శ్రీ వాసవి మెడికల్ ఎంటర్‌ప్రైజెస్ పది రోజులకు గాను సీజ్ చేశారు. మరోమారు ఆర్ఎంపీలకు మందులు సరఫరా చేసినట్లు తేలితే ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీ ప్రసాద్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ, పక్కన సీఐ

ఖమ్మం క్రైం: ఖమ్మం రాపర్తినగర్ రైల్వే బ్రిడ్జి సమీపాన గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వివరాలను నగర ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు. ఖమ్మం రాపర్తినగర్ ప్రాంతానికి చెందిన శీలం రవి, పెండ్రా వరుణ్, ఇగావే శ్రావణ్, దోతుల సాయిరాఘవేంద్ర కొంత కాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. సొంత అవసరాలతో పాటు ఇతరులకు విక్రయించేందుకు వివిధ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొస్తున్నారు. పక్కా సమాచారంతో మంగళవారం పోలీసులు తనిఖీ చేపట్టగా నలుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.10వేల నగదుతో పాటు 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బి.బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.